# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com



కడవేర్గు రాజశేఖర్

# కవరింగ్‌తో... మోదీ 'సూపర్ రిచ్' కలరింగ్!

పూర్వం ఓ చక్రవర్తి ఉండేవాడు. తన సామంత రాజ్యాల్లో పాలన ఎలా సాగుతుందో స్వయంగా చూడాలనుకున్నాడు. క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నట్టు చాటింపు వేయించాడు. దీంతో సామంత రాజులు ఏర్పాట్లు చేయడం ప్రారంభించారు. చక్రవర్తి వస్తున్నాడు అని తెలియగానే ఓ సామంత రాజుకు కలవరం మొదలైంది. తన పాలనలో దివాలా తీసిన రాజ్యాన్ని చూసి చక్రవర్తి ఏమంటాడోనని భయం పట్టుకున్నది. ఇంతలో రాజుగారు ఊళ్లోకి ఏమీ రావట్లేదని, పొలిమేరల్లోనుంచే ఊరిని చూసి వెళ్తున్నారని ఎవరో చెప్పారు. దీంతో సదరు సామంత రాజు.. ఊళ్లోని దరిద్రం కనిపించకుండా.. పొలిమేరల్లో తాత్కాలికంగా ఓ రెండు అద్దాల మేడలను, ఆ పక్కనే ఓ అందమైన మందిరాన్ని, విడిదిని ఏర్పాటుచేశాడు. పొలిమేరల్లో నుంచి వెళ్తున్న రాజుగారు.. సదరు భవనాలను చూసి 'అబ్బా.. ఎంత వైభోగంగా ఉంది ఈ ఊరు' అంటూ మురుస్తూ వెళ్లిపోయారు. 'కవరింగ్‌తో సూపర్ రిచ్ కలరింగ్' ఇచ్చిన సామంత రాజు ఊపిరి పీల్చుకున్నాడు.

ఇప్పుడు ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే.. బీజేపీ పాలనలో ప్రస్తుతం దేశంలోని పరిస్థితులు కూడా ఆ సామంత రాజ్యంలాగే తయారయ్యాయి. ఓ వైపు ధరలు కొండెక్కాయి. నిరుద్యోగం తాండవిస్తున్నది. భద్రత ప్రశ్నార్థకమైంది. మొత్తంగా ఆర్థిక, సామాజిక, విద్య, వైద్య, పారిశ్రామిక, సమానత్వ, పౌర స్వేచ్ఛ తదితర 50కి పైగా సూచీల్లో భారత్ అట్టడుగున నిలిచింది. అయితే, ఇదేమీ పట్టని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్థిక పరిమాణంలో భారత్ రాకెట్ వేగంతో దూసుకుపోతున్నట్టు మాత్రం ప్రచారం చేసుకుంటున్నది. 'జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ అవతరించింది' అంటూ బీజేపీ పరివారం జబ్బలు చరుచుకొంటున్నది. మరికొద్ది రోజుల్లో జర్మనీని కూడా దాటేస్తామంటూ బీరాలకు పోతున్నది. దేశంలోని ఒక్క శాతం మంది కుబేరులను చూపించి 'భారత్ సూపర్ రిచ్ కంట్రీ' అంటూ కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నది. భారత్ నిజంగానే సిరితో తులతూగుతున్నట్టయితే.. 80 కోట్ల మందికి ఉచిత బియ్యాన్ని మోదీ సర్కారు ఎందుకు సరఫరా చేస్తున్నట్టు? ఇది మిలియన్ డాలర్ ప్రశ్న.

## మనది 'సూపర్ రిచ్' మేడిపండు

లింక్డ్ ఇన్‌లో హార్దిక్ జోషి అనే ఆర్థిక నిపుణుడు ఇటీవల చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. వాస్తవికతకు దగ్గరగా ఉండటమే ఆ పోస్ట్ వైరల్ కావడానికి ప్రధాన కారణం. 'భారత్‌లోని ఒక శాతం సంపన్నుల సంపదను ఆర్థికవ్యవస్థ నుంచి తొలగిస్తే, మన దేశం ఆఫ్రికన్ దేశాల సరసన చేరుతుంది' అంటూ ఆయన చేసిన పోస్ట్‌లో నిజం ఉన్నది.

> ఆర్థిక పరిమాణంలో ప్రపంచంలోనే భారత్ నాలుగో స్థానంలో ఉన్నది అంటున్నారు.. అయితే, అలాంటి ఈ దేశంలో సగానికి పైగా ప్రజలు మూడు పూటలా తిండి తినే పరిస్థితి ఎందుకు లేదు? ఆకలి సూచీలో భారత్ 105వ ర్యాంకుకు ఎందుకు దిగజారింది? అనేది హార్దిక్ వంటి మేధావులు అడుగుతున్న ప్రశ్న.

ఒక విధంగా ఇది కూడా ఆలోచించాల్సిన విషయమే. ఒక దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పెరగటం అంటే కేవలం 10 మంది ఆస్తులు పెరగటం కానే కాదు. ఆ దేశంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో గుణాత్మక మార్పు రావటం. అయితే, భారత్‌లో ఇది భిన్నంగా ఉన్నది. దేశ జనాభాలో ఒక్క శాతం ఉన్న సంపన్నుల దగ్గరే 40 శాతం సంపద పోగుపడిందని నివేదికల సారాంశం. కింద ఉన్న 50 శాతం మంది దగ్గర 3 శాతం మాత్రమే సంపద ఉన్నట్టు నిపుణులు చెప్తున్నారు. భారతీయుల తలసరి ఆదాయం రూ.2.12 లక్షలుగా చెప్తున్న ఆర్థిక నిపుణులు.. బీహార్ వంటి



**సంపన్నులపై 'కరోడ్‌పతి ట్యాక్స్' సూచనలు ఇలా..**

| | కనీస ఆదాయం | మోస్తరు ఆదాయం | గరిష్ఠ ఆదాయం (వెయ్యి కోట్లు ఆపైన వారికి) |
|---|---|---|---|
| సంపదపై పన్ను | 10 కోట్ల పైన 2% | 10 కోట్ల పైన 2%<br>100 కోట్ల పైన 4% | 10 కోట్ల పైన 3%<br>100 కోట్ల పైన 5% |
| వారసత్వ పన్ను | 10 కోట్ల పైన 33% | 10 కోట్ల పైన 33%<br>100 కోట్ల పైన 45% | 10 కోట్ల పైన 45%<br>100 కోట్ల పైన 55% |

రాష్ర్టాల్లో ఒక్కో పౌరుడు ఏడాదికి సంపాదిస్తున్న ఆదాయం రూ.50 వేలు కూడా దాటడం లేదన్న విషయాన్ని మాత్రం పట్టించుకోవట్లేదు. అంబానీ కుటుంబం ఆస్తులు, వ్యాపారాల విలువ రూ. 25 లక్షల కోట్లకు పైగా ఉందని లెక్కగడుతున్న నివేదికలు.. దేశంలోని ప్రతీ పౌరుడి నెత్తిపై రూ.1.37 లక్షల అప్పు ఉన్నదన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నాయి. ఇక్కడే దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలకు బీజం పడుతున్నది.

దేశంలో కొవిడ్ ప్రబలిన తర్వాత ప్రజల ఆదాయం తీవ్రంగా పడిపోయింది. ఇందుకు భిన్నంగా సంపన్నులు, కార్పొరేట్ల ఆదాయం ఊహకు అందనంతగా పెరిగిపోయింది. కొవిడ్ కాలంలో దేశంలోని బిలియనీర్ల సంపద విలువ రూ.23.14 లక్షల కోట్ల నుంచి రూ.53.16 లక్షల కోట్లకు పెరిగింది. అదే సమయంలో కోట్లాదిమంది భారతీయులు ఉపాధి కోల్పోయి పేదరికంలోకి జారుకున్నారు.

> కార్పొరేట్లకు ఎర్ర తివాచీ పరిచి ఆర్థికంగా ఎదిగేందుకు సాయపడుతున్న బీజేపీ సర్కారు.. పేద, మధ్యతరగతి విషయంలో సవతి తల్లి ప్రేమనే చూయిస్తున్నది. ఉదాహరణకు.. పేద, మధ్య తరగతి ప్రజల ముక్కుపిండి నయా పైసలతో సహా వసూలు చేసే బ్యాంకులు.. వేల కోట్ల రూపాయలు తీసుకొని విదేశాలకు పారిపోయిన కార్పొరేట్ల అప్పులను మాత్రం రైటాఫ్ చేస్తున్నాయి.

ప్రధాని మోదీ పదేండ్ల పాలనలో బ్యాంకులు ఇప్పటివరకూ రూ. 16.35 లక్షల కోట్లను రైటాఫ్ చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్రమే ఒప్పుకున్నది. ఐక్య రాజ్య సమితి లెక్కల ప్రకారం.. కొవిడ్ ప్రబలిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా పేదరికంలోకి జారుకున్న వారిలో సగం మంది భారతీయులే ఉన్నారు. బీజేపీ పరివారం చెప్తున్నట్టు సూపర్ రిచ్ అవుతున్న భారతదేశంలో మరే దేశంలో లేనంతమంది పేదలు ఎందుకున్నారు? సంపదలోనే కాదు పేదల సంఖ్యలోనూ భారత్ సూపర్ రిచ్ ఎందుకవుతుందో ఆలోచించకపోతే బీజేపీ ప్రభుత్వం చూపిస్తున్న ఈ అంకెల గారడీనే నిజమైన అభివృద్ధి అని భ్రమలో పడే ప్రమాదం ఉన్నది. ఆర్థికాభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి మధ్య అంతరాలను కొలిచే ఆర్థిక గణాంకాలను ప్రతి పౌరుడూ గుర్తించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నది. దారితప్పి దౌడు తీస్తున్న ట్రబుల్ ఇంజిన్‌కు బ్రేకులు వేయాల్సిన అవసరమూ ఇప్పుడున్నది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ నిలిచిందని గర్వపడుతున్న ప్రతీ ఒక్కరూ.. తమ ఆర్థిక, సామాజిక స్థితిలో ఎంత మేర గుణాత్మక మార్పు జరిగిందో ఒకసారి బేరీజు వేసుకోవాలి. అప్పుడే భారత్ సూపర్ రిచ్ అనేది కవరింగో, కలరింగో తేలుతుంది.

## 'కరోడ్‌పతి ట్యాక్స్'తో మేలు

ప్రపంచంలో వివిధ దేశాల్లో అంతకంతకూ పెరుగుతున్న ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ఫ్రాన్స్‌కు చెందిన వరల్డ్ ఇనిక్వాలిటీ ల్యాబ్ ఆర్థికవేత్తలు నిరుడు పలు కీలక సూచనలు చేశారు. సంపన్నులపై 'కరోడ్‌పతి ట్యాక్స్' విధించాలని సిఫారసు చేశారు. సంపదపై పన్ను, వారసత్వ పన్ను పేరిట ఈ ట్యాక్స్ ఉండాలని సూచించారు. రూ.10 కోట్ల వరకూ సంపాదన ఉన్నవారికి ఒకవిధంగా, రూ.100 కోట్ల సంపాదన ఉన్నవారికి కొంచెం ఎక్కువగా, రూ.100 కోట్లకు పైగా సంపాదన ఉన్నవారికి మరింత ఎక్కువగా ట్యాక్స్ ఉండాలని ఓ పట్టికను విడుదల చేశారు. ఈ సూచనలను మన దేశానికి అన్వయిస్తే.. సంపన్నుల నుంచి సేకరించిన డబ్బుతో సగటు భారతీయుడికి విద్య, వైద్యం, పోషకాహారం అందించే వీలు కలుగుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కొండంత రాగం తీసి..

భారత ఆర్థికాభివృద్ధి విషయంలో మోదీ ప్రభుత్వ వైఖరి 'కొండంత రాగం తీసి కూసంత పాట పాడిన' చందంగా తయారైనట్టు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ వివిధ సందర్భాల్లో చేసిన వ్యాఖ్యల వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. భారత్ ఆర్థికవ్యవస్థ ప్రస్తుతం 8 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఉన్నదని 2015లో ప్రధాని మోదీ ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. దీన్ని 20 ట్రిలియన్లకు చేర్చడమే తన కలగా అప్పుడు చెప్పుకొచ్చారు. 2024 చివరి నాటికి భారత ఆర్థికవ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మార్చడమే తమ లక్ష్యమని 2024 ప్రారంభంలో మోదీ తెలిపారు. భారత ఆర్థికవ్యవస్థ 3.8 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అవతరించినట్టు ఇటీవల ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు. మోదీ వ్యాఖ్యలను విన్న పలువురు.. 8 ట్రిలియన్ల ఆర్థికవ్యవస్థ 3.8 ట్రిలియన్లుగా ఎలా మారిందంటూ ప్రశ్నిస్తున్నారు. మోదీ వైఖరి 'కొండంత రాగం..' అన్నట్టుగా ఉన్నదని వ్యంగ్యంగా కామెంట్లు పెడుతున్నారు.



# మోదీపై పోరు.. రేవంత్ బేజారు

> దేశంలో ప్రతిపక్ష ముఖ్యమంత్రులు ప్రధాని మోదీని కలవడానికి ఇష్టపడటం లేదు. ఆయన ఆధ్వర్యంలో జరిగే నీతి ఆయోగ్ సమావేశాలు, ఇతర సదస్సులకు హాజరయ్యేందుకు కూడా వారు విముఖత చూపుతున్నారు. కానీ, మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం తరచు ప్రధానిని కలవడంతోపాటు నీతిఆయోగ్ సమావేశాల్లో మోదీ విధానాలను ప్రశంసిస్తూ సొంత పార్టీని ఇరకాటంలో పడేస్తున్నారు.

మమతాబెనర్జీ, స్టాలిన్, విజయన్, సిద్ధరామయ్య, భగవంత్‌సింగ్ మాన్, హేమంత్ సోరెన్ తదితరులు నిత్యం మోదీ ప్రభుత్వ అనాలోచిత విధానాలను వ్యతిరేకిస్తున్నారు. తమ రాష్ర్టాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. సమయం, సందర్భం వచ్చినప్పుడల్లా మోదీ సర్కారు తప్పుడు విధానాలు, నిర్ణయాలపై విమర్శలు గుప్పిస్తున్నారు. డీలిమిటేషన్‌పై స్టాలిన్.. సీఏఏ, ఎన్‌ఆర్సీలపై మమతా బెనర్జీ.. కేంద్రం ఫెడరలిజాన్ని విస్మరించడంపై విజయన్.. రాష్ర్టాల నిధుల కోసం హేమంత్ సోరెన్ చేస్తున్న పోరాటాలను మనం చూస్తునే ఉన్నాం. కానీ, కాంగ్రెస్ సీఎం రేవంత్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటం ఇప్పుడు రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తున్నది.

ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన రేవంత్‌రెడ్డి బీజేపీ విధానాలను ప్రశంసించారు. వికసిత్ భారత్-2047ను సమర్థిస్తూ, తెలంగాణ రైజింగ్-2047 అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి, ఆపరేషన్ సిందూర్‌ను మోదీ ఉన్నపళంగా, ఏకపక్షంగా నిలిపివేశారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తుంటే.. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని మోదీని రేవంత్ పొగడ్తల్లో ముంచెత్తారు. ఓవైపు రాష్ర్టాలకు 50 శాతం పన్ను వాటా ఇవ్వాల్సిందేనని పక్క రాష్ట్ర సీఎం స్టాలిన్ డిమాండ్ చేయగా, రేవంత్ మాత్రం రాష్ర్టాల హక్కులు గురించి ప్రస్తావించలేదు.

మరోవైపు బీజేపీ నేతలు కూడా చోటే భాయ్‌తో అంటకాగుతున్నారు. అమృత్ పథకం టెండర్లను రేవంత్ తన బావమరిదికి కట్టబెట్టినట్టు ఆరోపణలు వచ్చినా, నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ పేరున్నా బీజేపీ నేతలు విమర్శలు కాదు కదా, కనీసం పల్లెత్తు మాట కూడా అనటం లేదు. బడే భాయ్-చోటే భాయ్ బంధమే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.



శ్రీను నాయక్ దోన్‌వాన్
85220 18001
(వ్యాసకర్త: బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి, ఓయూ)

# కలం కవాతుకు పాతికేండ్లు!

దశాబ్దం కిందనే తెలంగాణ కొత్త చరిత్రను రాసుకున్నది. మునుపటి గాయాలను మాన్చుకొనే ప్రయత్నం చేస్తున్నది. గత చరిత్రలో... గాయాలను మాన్పే చికిత్సలో జర్నలిస్టులు భాగస్వాములే. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీలో తెలంగాణ పేరు ఎత్తొద్దన్న మాట విన్న కలం కార్మికులు కలత చెందారు. తెలంగాణ ప్రాంతంలో మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజలు ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవనం సాగించడాన్ని జీర్ణించుకోలేని బుద్ధిజీవులు ప్రత్యక్ష ఉద్యమంలో భాగస్వాములు కావాలని నిర్ణయించుకున్నారు. అలాంటి పరిస్థితుల మధ్య తెలంగాణ జర్నలిస్టులు స్వయం పాలన కోసం ఉద్యమించడానికి కంకణబద్ధులయ్యారు.

'తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు' అనే ట్యాగ్‌లైన్‌తో 2001 మే 31న ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కోసం 'తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం'ను స్థాపించారు. 14 ఏండ్ల మలిదశ ఉద్యమంలో అనేక సందర్భాల్లో ఉద్యమానికే టార్చ్ బేరర్ అయ్యారు. ఈ సంస్థ ఆవిర్భవించి 25 ఏండ్లు అయిన సందర్భంగా గతాన్ని ఓ సారి మననం చేసుకునే ప్రయత్నమే ఈ వ్యాసం.



అస్కాని మారుతీ సాగర్
90107 56666

తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఏర్పడిన సందర్భం రాజకీయంగా చాలా క్లిష్టమైనది. అప్పటికే కొంతమంది ప్రత్యేక తెలంగాణ కోసం వివిధ రూపాల్లో ఉద్యమాలు చేస్తున్నారు. నిర్బంధాలు ఎదుర్కొంటున్నారు. పట్టు వదలకుండా ప్రయత్నిస్తూనే ఉన్నారు.

> ఆ తర్వాత చరిత్రను మలుపు తిప్పిన ఘటన టీఆర్‌ఎస్ ఆవిర్భావం. దాంతో ఉద్యమానికి ఓ దిక్సూచి దొరికినట్టు అయ్యింది.

మేధో, సాహిత్య, సాంస్కృతిక రంగాల నుంచి కొంత మద్దతు దొరుకుతున్న సందర్భం. పలు ఆలోచనా స్రవంతులు కలిసి ఓ ప్రవాహం అవుతున్న నేపథ్యం. అదే సందర్భంలో కొద్దిమంది జర్నలిస్టుల సమాలోచనలతో ఈ సంస్థ ఏర్పడింది. తెలంగాణ లక్ష్య సాధనలో తనదైన ముద్ర వేసుకున్నది. చరిత్రలో తానూ ఓ భాగం అయ్యింది. తెలంగాణ రాష్ట్రం ఎందుకు? ఎవరి కోసం? స్వయం పాలన, ఆత్మగౌరవం తదితరాంశాలను వ్యక్తీకరిస్తూ తొలుత ఓ కరపత్రం వెలువరించింది ఈ ఫోరం. ఆ తర్వాత ఈ సంస్థే రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చింది. 2010-11 సంవత్సరాల్లో ఉస్మానియా యూనివర్సిటీలో నాటి ప్రభుత్వం చేసిన దమనకాండను ఖండించింది. అనుక్షణం విద్యార్థులకు అండగా నిలబడింది. సంస్థ అధ్యక్షులు అల్లం నారాయణ, చంటి క్రాంతి కిరణ్, పిట్టల శ్రీశైలం, కందుకూరి రమేష్ బాబు, రమణకుమార్, శశికాంత్, రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంస్థతోపాటు మొదట్లో వందలాదిగా, తదనంతరం వేలాదిగా జర్నలిస్టులు కలిసి రాగా, నాటి ఉస్మానియా విద్యార్థులతో పాటు అనేక ఉద్యమ సంస్థలు కలిసి నడిచాయి. నిషేధాజ్ఞలు అమలవుతున్న సందర్భంలో, 144 తదితర సెక్షన్లు విధించిన నేపథ్యంలో ఉద్యమంలో ముందుభాగాన నిలబడ్డ జర్నలిస్టులు పోలీసుల లాఠీ దెబ్బలు రుచిచూడక తప్పలేదు. తెలంగాణ కోసం బలవన్మరణాలు జరుగుతున్న సందర్భంలో, ఉద్యమ వేడి కాస్త చల్లారిందనుకున్న సమయంలో జర్నలిస్టులు రాష్ట్ర రాజధానిలో కలం కవాతు చేశారు. ఉద్యమం బలాన్ని తమ గళం ద్వారా వినిపించారు. గన్ పార్క్ నుంచి ఆర్టీసీ కల్యాణమండపం వరకు దాదాపు 5 వేల మంది జర్నలిస్టులతో చేసిన ర్యాలీ అయినా, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు చేసిన ప్రదర్శన అయినా ప్రత్యేక రాష్ట్రోద్యమానికి ఊతం ఇవ్వడానికే.

సీమాంధ్ర నాయకత్వాల కింద ఉన్న తెలంగాణ ప్రజాప్రతినిధులచేత రాజీనామాలు చేయించి నాటి ఉద్యమ పార్టీలోకి వెళ్లేలా చేసింది టీజేఎఫ్. గద్దర్, కేసీఆర్‌లతో గొప్పగా టీజేఎఫ్ సమావేశం నిర్వహించింది. తెలంగాణ బిల్లు అసెంబ్లీకి వచ్చిన సందర్భంలో దాదాపు 60 మంది మన ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణకు సంబంధించిన అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎలా వ్యవహరించాలనే విషయమై సంధానకర్తగా వ్యవహరించింది కూడా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమే. తెలంగాణ వాయిస్ జాతీయ స్థాయిలో వినిపించేందుకు వేలాది మంది జర్నలిస్టులతో 2011 మే 17న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి దేశ రాజధానిలో జంతర్ మంతర్ వద్ద మహాధర్నా చేసి జాతీయస్థాయిలో తెలంగాణ ఉద్యమం తీవ్రతను చాటిచెప్పే ప్రయత్నం చేసిందీ టీజేఎఫ్. ఢిల్లీ స్థాయిలో జర్నలిస్టులు తమ ప్రాంత అస్తిత్వం కోసం, ఇంత పెద్ద ఎత్తున ఉద్యమించిన దాఖలా సమీప చరిత్రలో లేదనడం అతిశయోక్తి కాదేమో. రాజకీయ ఏకాభిప్రాయం సాధించేందుకు సభలు, సమావేశాలు, మీడియా మీట్లు ఏర్పాటు చేసింది టీజేఎఫ్.





ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ప్రేరణగా పని చేసిన మిలియన్ మార్చ్, సాగరహారం వంటి కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలబడింది టీజేఎఫ్. ఉద్యమంలో తమ వాహనాలకు నిప్పుపెట్టినా, కెమెరాలను బద్దలు కొట్టినా లెక్క చేయకుండా ముందు వరుసలో నిలబడ్డవారు జర్నలిస్టులు. దారులన్నీ దిగ్బంధనం చేసిన సందర్భంలో ఉద్యమానికే దారి చూపించిందీ ఈ సంస్థే. టీజేఎఫ్ చేసిన కార్యక్రమాలన్నీ అంబేద్కర్ బాటలో నడిచాయి. బోధించు, సమీకరించు, పోరాడు. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకొని ముందుకుసాగింది టీజేఎఫ్. క్షేత్రస్థాయిలో పనిచేసినవారు మాత్రమే కాదు, నాయకత్వ స్థానాల్లో ఉన్న దాదాపు అందరికి అందరూ బహుజనులే. జిల్లాల్లో కూడా ఉద్యమ నాయకత్వంలో ఉన్నవారు కూడా బహుజనులే. తెలంగాణలో అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి ఏర్పడ్డ జేఏసీ నియోజకవర్గ, జిల్లాల చైర్మన్లుగా ఎందరో జర్నలిస్టులున్నారు. వాస్తవానికి అంతకుముందున్న జర్నలిస్టు సంఘాలకు, టీజేఎఫ్‌కు మౌలికంగానే చాలా వ్యత్యాసం ఉంది. పలు సామాజిక ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చినవారి ఆలోచన ఇందులో ప్రధానంగా ఉన్నది. ఈ సంస్థ ఏర్పాటు నుంచి స్వయంపాలన మొదలయ్యేంత వరకు కూడా చాలా చురుగ్గా పని చేసింది.

> 14 ఏండ్ల పోరాటం అనంతరం రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ సంఘంగా ఏర్పడింది. జర్నలిస్టుల కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో నాటి ప్రభుత్వం ద్వారా భారీ సంక్షేమ నిధిని కూడా ఏర్పాటు చేసింది.

జర్నలిస్టుల హక్కుల కోసమే కాకుండా తమ సామాజిక బాధ్యతను కూడా గుర్తించింది. చరిత్రలో తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్నది టీజేఎఫ్. సంస్థ ఏర్పాటై 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హైదరాబాద్‌లోని జలవిహార్‌లో మే 31న జర్నలిస్టుల సభ జరుగనున్నది. మరోసారి 'తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు' అనే నినాదాన్ని గుర్తుచేసుకుంటూ ఎప్పటికీ తెలంగాణ ఆత్మగా ఈ సంస్థ ఉండాలని, ఉంటుందని భావిస్తూ...

(వ్యాసకర్త: ప్రధాన కార్యదర్శి, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్)






## ప్రకృతికి కులం ఉందా?

ఇటీవల నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షలో పెరియార్‌కు కులాన్ని ఆపాదించాలని చూశారు. ఇలాంటి వాటిని మనం ఖండించాలి. ప్రకృతిలో నెలవైన సూర్యుడు, వరుణుడు లాంటి వారికి కులం, మతం ఉన్నాయా? కులం, మతం ఆధారిత విభజనను ప్రోత్సహించకండి. అవి మీ (విద్యార్థులు) మెదళ్లను కలుషితం చేస్తాయి.

**- విజయ్, సినీ నటుడు**



# గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం.. తెలంగాణ!

స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, న్యాయం, భద్రత, స్థిరమైన జీవనోపాధి కోసం ఆకాంక్షించిన లక్షలాది మందికి 2014 జూన్ 2 నాటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భం ఒక చారిత్రక విజయం. 2000వ సంవత్సరం నుంచి కేసీఆర్ చేసిన అవిరళ కృషి ఫలితంగా స్వరాష్ట్రం ఏర్పడింది. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో గణనీయమైన మార్పులు జరిగాయి. దేశంలో అభివృద్ధి, పరిపాలనకు ఒక స్థిరమైన ఆదర్శంగా తెలంగాణ స్థిరపడిపోయింది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం కోసం కేసీఆర్ మార్గనిర్దేశంలో కేటీఆర్ ఎంతో కృషి చేశారు.



రావు కల్వల

స్వాతంత్ర్యం, ఆత్మగౌరవ నినాదంతో ఉద్యమ జెండా ఎత్తిన కేసీఆర్ స్వరాష్ట్రాన్ని సాధించారు. విద్య, ఉపాధి, నీళ్ల తదితర అంశాల్లో ఆంధ్రా పాలకుల వివక్షకు కేసీఆర్ చరమగీతం పాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా గురుతర బాధ్యతను తన భుజాలపై వేసుకున్న కేసీఆర్.. ప్రజల సంక్షేమం, సాధికారత కోసం పాటుపడ్డారు. రైతులు, పేదలు, మహిళలు, దళితులు, గిరిజనులు, బడుగుబలహీనవర్గాల సమగ్రాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పన, నిరంతర విద్యుత్తు, ఐటీ, అర్బన్ డెవలప్‌మెంట్ ద్వారా తెలంగాణను పునర్నిర్మించారు. సాంకేతిక, సృజనాత్మక విధానాలను అవలంబించిన కేటీఆర్ తన తండ్రి విజన్‌ను ముందుకు తీసుకెళ్లారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దారు.

కేసీఆర్ విజన్ తెలంగాణకు ఒక గళాన్ని ఇచ్చింది. కేటీఆర్ విజన్ ద్వారా గ్లోబల్ దృక్పథంతో భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే సమగ్ర, సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ నిర్మితమైంది. వారిరువురి నాయకత్వ కలయిక దశాబ్ద కాలంలోనే తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపింది.

> కేసీఆర్ పాలనలో మన భాష, మన పండుగలు, తెలంగాణ తల్లికి గుర్తింపు దక్కింది. కుమ్రం భీం, చాకలి ఐలమ్మ, కాళోజీ లాంటి తెలంగాణ కవులు, రచయితలు, వీరులు గౌరవం పొందారు.

కేసీఆర్ పాలనలో పదేండ్లపాటు రాష్ట్రంలో భారీగా మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. 2014లో లోటు విద్యుత్తులో ఉన్న పరిస్థితి నుంచి 24 గంటల పాటు నాణ్యమైన, నిరంతర కరెంట్ సరఫరా చేసే స్థితికి రాష్ట్రం చేరుకున్నది. అంతేకాదు, రైతులకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేశారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు, ఫ్లైఓవర్లు, సిగ్నల్ ఫ్రీ కారిడార్లు, నిరంతర విద్యుత్తు తదితర సదుపాయాలు టెకీలు, డాక్టర్లు, ఇంజినీర్లు, ఎన్నారైలను ఆకర్షించాయి. కేటీఆర్ తరచుగా తెలుగు ఎన్నారైలతో మమేకమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించారు.

కేటీఆర్ కృషి ఫలితంగా ఐటీ, పరిశ్రమల రంగాలు పరుగులు పెట్టాయి. 2014లో రూ.57 వేల కోట్లుగా ఉన్న తెలంగాణ ఐటీ ఎగుమతులు 2023 నాటికి రూ.2.41 లక్షల కోట్లకు చేరుకున్నాయి. సుమారు 7 లక్షలకు పైగా ఉద్యోగాల సృష్టి జరిగింది. కేటీఆర్ తీసుకొచ్చిన విధానాల మూలంగా అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్, యాపిల్, ఊబర్ లాంటి బహుళజాతి సంస్థలు హైదరాబాద్‌లో తమ అతిపెద్ద క్యాంపస్‌లను ఏర్పాటు చేశాయి. స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలు, మహిళా పారిశ్రామికవేత్తలకు సాంకేతిక మద్దతు అందించేందుకు టీ హబ్, వీ హబ్‌లను కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసింది. దళిత బంధు పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసి దళితులను ఆంత్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దారు.

రాష్ట్ర ప్రజల సర్వతోముఖావృద్ధి కోసం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేశారు. మిషన్ భగీరథ పథకం కింద రాష్ట్రంలోని అన్ని ఇండ్లకు సురక్షిత మంచినీటి సరఫరా చేశారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 46 వేలకు పైగా చెరువులు పునరుద్ధరించారు. పల్లె, పట్టణ ప్రగతి పథకం కింద గ్రామాలు, పట్టణాలు సుందరంగా మారాయి. స్వయంపాలనలో భాగంగా తండాలు, ఆదివాసీ గూడేలను కేసీఆర్ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధి కోసం నెలనెలా (ఏటా రూ.5-25 లక్షల వరకు) నిధులు మంజూరు చేశారు. అనేక ప్రభుత్వ విద్యాసంస్థలు, మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలను కేసీఆర్ నెలకొల్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లల కోసం వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేశారు.

ఆధునిక పరిపాలనా పద్ధతులతోపాటు నిధులు, వినూత్న పథకాలు, స్వయంప్రతిపత్తి ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం ఆలోచనకు కేటీఆర్ ఆచరణ రూపం ఇచ్చారు. గాంధీజీ గ్రామస్వరాజ్యానికి ప్రాతిపదికలైన స్వయం సమృద్ధి, స్వచ్ఛత, సాధికారతలతో తెలంగాణ దేశంలోని అన్ని రాష్ర్టాలకు ఆదర్శంగా మారింది. గతంలో కేటీఆర్ చెప్పినట్టుగా.. మన పల్లెలు ఆదర్శ పల్లెలుగా మారాయి, ఒకవేళ గాంధీజీ కనుక బతికుంటే, తెలంగాణ గ్రామీణాభివృద్ధిని చూసి సగర్వంగా అభినందించేవారు.

(డాలస్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా)